ప్రజాశక్తి

ఆదివారం 4 ఆగస్టు 2024 | 5 | విజయనగరం

పట్టాలిచ్చారు.. నిర్మాణాలు అడ్డుకున్నారు

తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు ఆందోళన

రేగిడి : రేగిడి గ్రామానికి చెందిన గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు.. కానీ నిర్మాణాలు చేపడితే పాలకులు, రెవెన్యూ అధికారులు అడ్డు తగులుతున్నారని, ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చి ఆదుకోవాలని బాధితులు సరసననాపల్లి బుల్లెన్న దొర, బొడ్డపల్లి రామన్న దొర, నందివాడ గంగన్న దొర, సరసనా పల్లి అప్పనదొర, గులివెందల సూర్యనారాయణ దొరతోపాటు మరి కొంతమంది శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. గుల్లపాడు పంచాయతీ ఉంగరాడ మెట్ట సమీపంలో 2008లో అప్పటి ప్రభుత్వం గిరిజనులకు ఇళ్ల పట్టాలు అందజేసింది. 25 మందిలో 18 మంది గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ నిర్మాణానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి తమకు ఇచ్చిన పట్టాలపై ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని వారంతా కోరుతున్నారు.

తొలగింపునకు వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టిన విఒఎలు

వేధింపులు తొలగింపులు

- స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులపై టిడిపి పాలకుల కక్ష సాధింపు
- వేపాడలో 17 మంది విఒఎల తొలగింపు
- డెంకాడలో మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపు
- వ్యతిరేకంగా 5న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు సిఐటియు పిలుపు

ఇప్పుడే కాదు... కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు, పాలకులు చూపిన పక్షపాత వైఖరి, కక్షసాధింపు చర్యలు, బంధుప్రీతితో గ్రామ స్థాయిలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశావర్కర్లు, వెలుగు సిబ్బంది నలిగిపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో ఈ కక్ష సాధింపు మరింత ఎక్కువైంది. ఎన్నికల్లో వైసిపికి సహకరించా రంటూ దిగువ స్థాయి సిబ్బందిపైనా, చిరుద్యోగులపైనా టిడిపి నాయకులు కక్ష కట్టి తొలగించేందుకు చర్యలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే తొలగించగా, మరికొన్ని చోట్ల తొలగించేందుకు జాబితాలను జిల్లా నాయకులకు, ఎమ్మెల్యేలకు అందజేస్తున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో పనిచేస్తున్న స్కీం వర్కర్లు, చిరుద్యోగులను తొలగించేందుకు టిడిపి నాయకులు చర్యలు చేపడుతున్నారు. వైసిపి హయాంలో నియమితులైన వారితో పాటు, వైసిపికి సహకరించారంటూ మరికొందరిపై కక్ష కట్టి తొలగించేందుకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిందే తడవుగా వారి దృష్టి స్కీం వర్కర్లపై పడింది. వారిని తొలగించి తమ మనుషులను వేసుకోవాలనే ఆలోచన తప్ప స్కీం పథకాల కింద పని చేస్తున్న వారు పేదలు,వెనుక బడిన కులాలు వారు అనే ఆలోచన లేకుండా రాజకీయ కక్ష సాధింపులకు టిడిపి నాయకులు పాల్పడుతున్నారు. వివిధ పథకాల్లో పని చేస్తున్న వారికి వచ్చే వేతనాలు కేవలం గౌరవ వేతనాలు మాత్రమే అయినా వారి పొట్టకొట్టి తొలగించాలని చూస్తున్నారు. అధికారంలోకి రాగానే జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, విఒఎలు, గ్రీన్ అంబాసిడర్లు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లపై వేధింపులకు పాల్పడుతున్నారు. తమను వచ్చి కలవాలని హుకుం జారీ చేయడం, ఉద్యోగంలోకి రావద్దని హెచ్చరించడం వంటి ఘటనలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఇప్పటికే వేపాడ మండలంలో వెలుగు పథకం ద్వారా పని చేస్తున్న 16 మంది విఒఎలను తొలగించారు. గంట్యాడ మండలంలో 17 మంది విఒఎలను విధుల్లోకి రావద్దని చెప్పారు. శృంగవరపుకోట, లక్కవరపుకోట, కొత్తవలసలో బుక్ కీపర్లను తొలగించారు.డెంకాడ మండలంలోని మధ్యాహ్న బోజన కార్మికులను విధులకు రావద్దని హెచ్చరించారు. గజపతినగరం మండలం పురిటిపెంటలో విఒఎలను తొలగించేందుకు ఆ గ్రామ టిడిపి నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. విజయనగరంలోని విటి అగ్రహారం హైస్కూల్, కస్పా, బిపిఎం హైస్కూళ్లలో పని చేస్తున్న మధ్యాహ్న బోజన పథకం కార్మికులను స్వచ్ఛందంగా మానేయాలని ఆదేశాలు జారీ చేశారు. గుర్ల మండల కేంద్రంలోని జెడ్పి హైస్కూల్లో వంటలు చేస్తున్న సిబ్బందిని మానేయాలని హుకుం జారీ చేయడం వంటి సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికే డెంకాడ మండలంలో మధ్యాహ్నం బోజన పథకం కార్మికులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుకు సిఐటియు నాయకులు వినతి పత్రం ఇచ్చి అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని కోరారు. భోగాపురం మండలంలో పలువురిని తొలగించేందుకు జాబితాలను సిద్ధం చేయగా, తనకు తెలియకుండా తొలగించివద్దని అక్కడి ఎమ్మెల్యే సూచించారు. ఎస్.కోటలో గ్రీన్ అంబాసిడర్లు, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారు. మరోవైపు పాఠశాలల్లో స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లోనూ తమ వారిని నియమించుకునేందుకు టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారు. మధ్యాహ్న బోజన పథకాన్ని అనేక ఇబ్బందులకు ఓర్చి, బిల్లులు సకాలంలో రాకపోయినా, వంట సామాన్లు ఇవ్వకపోయినా, వంటలు చేసేందుకు షెడ్ లు లేకపోయినా సామాజిక బాధ్యతగా వంటలు చేసి కార్మియకులు భోజనం అందిస్తున్నారు. అటువంటి వారిపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు అధికార పార్టీ నాయకులు పాల్పడుతున్నారు. రోజూ రోజుకూ ఈ వేధింపులు, తొలగింపు చర్యలు తీవ్రమవ్వడంతో వీరంతా రోడ్డున పడుతున్నారు. కక్ష సాధింపు చర్యలకు, తొలగింపునకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు పోరు బాటకు సిద్ధమయ్యారు. అందులో భాగంగానే సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

కక్ష సాధింపు చర్యలు ఆపాలి

ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులు కేవలం కిందిస్థాయి ఉద్యోగులు, స్కీం పథకాల్లో పనిచేస్తున్న సిబ్బందే లక్ష్యంగా వేధింపులకు, తొలగింపునకు పాల్పడడం సరికాదు. ప్రజలకు సేవ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వారు చిరు ఉద్యోగులు, కార్మికుల పొట్టలు కొట్టడం ఎంతవరకు న్యాయం? స్కీం వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు, విఒఎలు, కింది స్థాయి ఉద్యోగులపై వేధింపులు ఆపాలి. వీటిపై ఈనెల 5న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో స్కీం వర్కర్లంతా పాల్గొని విజయవంతం చేయాలి.

– కె.సురేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

వరద బాధితులను ఆదుకోవాలి

- జాతీయ విపత్తుగా ప్రకటించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు
- సిపిఎం ఆధ్వర్యంలో సహాయనిధి వసూలు

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తమ్మినేని, తదితరులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో వరదలు కారణంగా మరణించిన వారి కుటుంబాలను కేంద్రప్రభుత్వం ఆదుకోవాలని, జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వయనాడ్ వరద బాధితుల సహాయార్థం శనివారం సిపిఎం ఆధ్వర్యంలో విజయనగరంలోని తోటపాలెం, ఆర్టీసి కాంప్లెక్స్ ప్రాంతంలో నిధి వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయనాడ్‌లో జరిగిన విపత్తు కారణంగా 300 మంది మరణించారని, వందలాది మంది క్షతగాత్రులై ఆసుపత్రి పాలయ్యారని అన్నారు. జాతీయ పరిశోధన సంస్థకు కూడా అందని విధంగా నష్టం జరిగిందన్నారు. కేంద్రం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను పంపించినప్పటికీ దానిని రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేరళలో అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని విధాలా ప్రజలను, వరద బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు సహాయం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వయనాడ్ బాధితులకు సహకారాన్ని అందించాలని కోరారు. సిపిఎం దేశ వ్యాప్తంగా వయనాడ్ బాధితులకు అండగా నిలిచేందుకు విరాళాలు సేకరణ చేస్తోందన్నారు. జిల్లాలో అన్ని వర్గాలు ప్రజలు సహాయ సహకారాలు అందించి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, నాయకులు ఎ.జగన్మోహన్, కె.సురేష్, సిహెచ్ వెంకటేష్, డి.రాము, యుఎస్ రవికుమార్, బి.రమణ, అర్.ఆనంద్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : వయనాడ్ వరద బాధితులకు సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలో విరాళాలు సేకరించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు ఇచ్చారు. రూ.4200 విరాళాలు సేకరించినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి ఎస్.గోపాలం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గౌరీష్, వెంకట్, ఎస్‌ఎఫ్ఐ మండల అధ్యక్షులు మణికుమార్, కిరణ్, సహారా బాధితుల పోరాట కమిటీ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మీదాస్ పాల్గొన్నారు.

గజపతినగరం : వయనాడ్ వరద బాధితుల కోసం సిపిఎం ఆధ్వర్యంలో గజపతినగరం మెయిన్ రోడ్డులో విరాళాలు సేకరించారు. రూ.4 వేలు సహాయనిధి వసూలైందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, సిపిఎం నాయకులు హరికృష్ణవేణి, రాము, లక్ష్మణ, సోమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం, బొబ్బిలిలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం జిల్లా నాయకులు వి.లక్ష్మి, జి.శ్రీనివాస్, పి.శంకరరావు

ఇంటర్ విద్యార్థినికి పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

విద్యాభివృద్ధికి మరింత ప్రాధాన్యత

ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బాడంగి

విద్యాభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు శనివారం పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపల్ విజయకుమారి అధ్యక్షతన జరిగిన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులకు కూడా ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిటిసిలు శ్రీనివాసరావు, పాలవలస గౌరు, సర్పంచ్ కె.రమేష్, టిడిపి నాయకులు తెంటు రవిబాబు, కార్యదర్శి ఎల్.సత్యం, తెంటు చిరంజీవిరావు, కెజిబివి ప్రిన్సిపల్ హరిత, తదితరులు పాల్గొన్నారు.

గురుకులం సందర్శన

స్థానిక గురుకులాన్ని ఎమ్మెల్యే బేబినాయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యలను ప్రిన్సిపల్ టి.రామ్‌దాస్ ఎమ్మెల్యేకు విన్నవించారు. డైనింగ్ హాల్ చాలడం లేదని, కొత్త భవనం మంజూరు చేయాలని, అంతర్గత రోడ్లు నిర్మించాలని కోరారు. వెంటనే స్పందించిన ఆయన డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. కొత్త భవనం కోసం ప్రయత్నిస్తానని హామీనిచ్చారు.

ఎస్‌సి, ఎస్‌టిల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్‌సి కాలనీల తాగునీటి సరఫరాకు చర్యలు
- విజిలెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్
- కేసులను త్వరగా విచారిస్తాం : ఎస్‌పి వకుల్

విజిలెన్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టిల సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని, బాధితులకు అండగా నిలుస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హామీ ఇచ్చారు. ఎస్‌సి కాలనీలకు తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా జిల్లాలోని ఎస్‌సి కాలనీలను పరిశీలించి, తాగునీటి సదుపాయం ఉన్నదీలేనిదీ మూడు వారాల్లో తమకు నివేదిక అందజేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. గత సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపై తీసుకున్న చర్యలను, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి బి.రామానందం ముందుగా వివరించారు. అనంతరం జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అనధికార సభ్యులు కమిటీ ముందుంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో ఎస్‌సిలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి మోనటరింగ్ కమిటీ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతినెలా చివరి పనిదినం రోజు సివిల్ రైట్స్‌డేగా నిర్వహించాలని, దీనివల్ల చాలావరకు సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. అనధికార సభ్యుల విజ్ఞప్తి మేరకు, జిల్లాలోని అన్ని ఎస్‌సి కాలనీలకు జలజీవన్ మిషన్ లేదా ఇతర పథకాల నుంచి తాగునీటి సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అవసరమైన ఎస్‌సిలకు ప్రత్యేక శ్మశానవాటికల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని ఆర్‌డిఒలను ఆదేశించారు. దీనికోసం అన్ని ఎస్‌సి కాలనీల్లో సర్వే నిర్వహించాలని సూచించారు. సాంఘిక, గిరిజన సంక్షేమ వసతి గృహాలను సర్వే చేసి, అక్కడ ఉన్న సదుపాయాలు, సమస్యలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అట్రాసిటీ కేసుల్లో సాక్ష్యం చెప్పడానికి వచ్చే సాక్షులకు కూడా టిఎ, డిఎలు అందజేయాలని సూచించారు. జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టిలకు గరిష్ట ప్రయోజనం కల్గించే విధంగా మోనటరింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ, గతేడాది అక్టోబరు 10 నుంచి ఈ ఏడాది జూన్ 30 వరకు జిల్లాలో మొత్తం 66 ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో 41 కేసుల్లో దర్యాప్తు కొనసాగుతోందని, 9 కేసులు ట్రయిల్‌కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని, 16 కేసులను రిఫర్ చేశామని తెలిపారు. చట్టప్రకారం బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నామని, అట్రాసిటీ కేసుల్లో వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎస్‌పి తెలిపారు.

డిఆర్‌ఒ ఎస్‌డి అనిత మాట్లాడుతూ, ఇప్పటివరకు నమోదైన అట్రాసిటీ కేసుల్లో బాధితులకు అందించిన పరిహారాన్ని, పెండింగ్ కేసుల సంఖ్యను వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, సోషల్ వెల్ఫేర్ డిడి బి.రామానందరం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయలక్ష్మి, కమిటీ అధికార సభ్యులు జిల్లా బిసి సంక్షేమాధికారి సందీప్‌కుమార్, మెప్మా పిడి సుధాకరరావు, మత్స్యశాఖ డిడి నిర్మలకుమారి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు, పలువురు జిల్లా అధికారులు, సాంఘిక సంక్షేమశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎటిఎల్ మారథాన్‌లో ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అటల్ టింకరింగ్ ల్యాబ్ మారథాన్ 2023-24లో దేశవ్యాప్తంగా 500 టీం ఐడియాలలో విజయనగరం జిల్లా నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఆలిండియా టాప్ 500 ప్రాజెక్టులలో రాష్ట్రానికి వచ్చిన 35 ప్రాజెక్ట్‌లలో విజయనగరం జిల్లా నుంచి 5 ప్రాజెక్ట్ లు ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ ప్రేమ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. కొత్తవలస ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎం.నిఖిల్, డి. కార్తికేయ, పి.ప్రణయ్ కౌశిక్ (9వ తరగతి) తయారుచేసిన అడ్డంకిని తప్పించే యంత్రం, ఫోర్ట్ సిటీ స్కూల్ విద్యార్థులు ఎం.నిఖిల్, డి.కార్తికేయ, ఎం.ప్రణయ్ కౌశిక్ (9వ తరగతి) రూపొందించిన సమగ్ర నీటి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ, భోగాపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులు జి వర్షిత, సిహెచ్ యశస్విని, జి అక్షయ (9వ తరగతి) రూపొందించిన స్మార్ట్ ట్రాలీ, రామభద్రపురం జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు గౌతం, బి.శ్యాంసాయి (9వ తరగతి) రూపొందించిన ఎడ్జ్ డిటెక్షన్ రోబో, దెందేరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు పూజ శ్రీ, గోపి, బాల నరసింహ (10వ తరగతి) రూపొందించిన మొబైల్ తో నియంత్రించే రోబో చేయి ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను డిఇఒ ప్రేమ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు అభినందించారు.

ఆంధ్ర రిజర్వాయర్ నీరు విడుదల

ప్రజాశక్తి- మెంటాడ

ఆంధ్ర రిజర్వాయర్ నీటిని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి శనివారం విడుదల చేశారు. కుడి, ఎడమ కాలువల ద్వారా 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ రిజర్వాయర్ ద్వారా 23,565 ఎకరాలకు నీరు అందించాలని గతంలో టిడిపి ప్రభుత్వం నిర్మించిందని మంత్రి తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ అసమర్థత వల్ల కాలువల్లో పూడిక తీతలు, మరమ్మతులు చేపట్టలేదని, మంజూరైన నిధులు ఏమయ్యాయని అధికారులను నిలదీశారు. సాగునీరు అందుతున్న విషయంపై రైతుల సమస్యలను మంత్రి తెలుసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.16 కోట్ల జైకా నిధులు పూర్తిగా దుర్వినియోగం అయ్యాయని, పనులు తూ.తూ మంత్రంగా చేసి నిధులు మింగేశారని ఆమె వద్ద రైతులు గగ్గోలు పెట్టారు. దీనికి ఆమె స్పందిస్తూ అధికారులపై మండిపడ్డారు. ఈ నిధులతో ఎక్కడ పనులు చేశారని ఇరిగేషన్ అధికారులను అడగ్గా తెల్లమొహం పెట్టారు. నిధుల దుర్వినియోగంపై కమిటీని వేసి సమగ్ర దర్యాప్తు చేయిస్తానని రైతులకు మంత్రి భరోసా కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ లక్ష్మీబాయి, డిఇ పాండు, టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, నాయకులు గెద్ద అన్నవరం, గొర్లె ముసలి నాయుడు, ఎంపిటిసి పి.నరసయ్యమ్మ, రాయిపల్లి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై కమిటీ : మంత్రి సంధ్యారాణి

బటన్ నొక్కి నీరు విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

చేపల సొసైటీ ఏర్పాటు చేయాలి

ఆంధ్ర ప్రాజెక్టు నిర్మాణం భూములు కోల్పోయిన నిర్వాసితులకు చేపల సొసైటీ ఏర్పాటుచేసి ఆదుకోవాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి వద్ద ఆంధ్ర, లోతుగెడ్డ గ్రామాల గిరిజనులు మొరపెట్టుకున్నారు. నాలుగు జిల్లాల ప్రజలకు అవసరమైన గరుగుబిల్లి వద్ద బ్రిడ్జి, కల్వర్టుల నిర్మాణం పూర్తి చేసి గిరిజనుల ఇబ్బందులను తొలగించాలని వినతి అందజేశారు. ఆంధ్ర రిజర్వాయర్‌కు మంజూరైన నిధులపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు కోరారు.

చెస్ ఆడుతున్న చిన్నారులు

ఉత్సాహంగా చదరంగం పోటీలు

విజయనగరం టౌన్ : రాష్ట్ర అండర్ -7 ఓపెన్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు శనివారం స్థానిక గురజాడ పాఠశాలలో ప్రారంభమయ్యాయి. డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు ప్రారంభించిన ఈ పోటీలకు రాష్ట్రంలో వివిధ జిల్లాల నుండి 120 మందికి పైగా చిన్నారులు హాజరయ్యారు. రెండురోజులు పాటు జరిగే ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రముఖుల చేతుల మీదుగా ట్రోఫీలను అందజేయనున్నట్లు స్టేట్ చెస్ సెక్రటరీ ఎస్ . భీమా రావు, కోశాధికారి కె ఎస్.జ్వాలాముఖి, వైస్ ప్రెసిడెంట్ పి . మస్తాన్ బాబు తెలిపారు.

పింఛన్లు సరే... సూపర్ సిక్స్ సంగతేంటి?

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు రెండుసార్లు పింఛన్లు పంపిణీ చేశారు. ఇదేమీ కొత్త పథకం కాకపోయినప్పటికీ జిల్లాలో ఒకటో తేదీనే అందరికీ అందించేందుకు ప్రయత్నం చేశారు. ఆ మేరకు సఫలీ కృతులయ్యారనడంలో సందేహం లేదు. ఈ మాటకొస్తే ఒకటి రెండు రోజులు ఆలస్యమైనా మిగిలి ఉన్న అర్హులకు పింఛన్లు అందించారు. ఎప్పటి మాదిరిగానే ఇస్తున్నవారికి ఒకటోతేదీనే ఇవ్వాలంటూ గ్రామంలో సచివాలయ ఉద్యోగులు మొదలుకుని జిల్లా కలెక్టర్ వరకు మెడపై కత్తిపెట్టి హడావుడి చేయాల్సిన అవసరం లేదన్నది పబ్లిక్ టాక్. ఈ మాత్రం సమయం, ఈపాటి శ్రద్ధ అదేదో సూపర్ -6 పథకాల అమలుపై చూపితే బాగుటుందని జనంలో చర్చసాగుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. వైసిపి ఓటమికి, టిడిపి, జనసేన కూటమి గెలుపునకు ఆయా పార్టీల ఉమ్మడి అజెండాగా ప్రవేశపెట్టిన సూపర్ -6 పథకాలు ఎంతో ఉపకరించాయి. వీటిలో ఉచిత గ్యాస్ సిలిండర్లు ఒక్కటే కొత్త పథకం. మిగతా అన్నీ పాత పథకాలే అయినప్పటికీ డబ్బులు కాస్తా పెంచారు. దీంతో, జనం కూడా ఆకర్షితులయ్యారు. ఇందులో తల్లికి వందనం పథకం గురించి చెప్పుకుంటే పాఠశాలకు ఎంతమంది విద్యార్థులు వెళ్తే వారందరికీ రూ.15వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని చెప్పారు. అంతటితో ఆగలేదు. ఈ లెక్కన ఈ పథకం పాఠశాలల ప్రారంభం నేపథ్యంలో జూన్, లేదా జులైలోనే అమలు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉండేదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఎందుకంటే పుస్తకాలు, ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు, ఇతరాత్ర ఖర్చులు రూ.వేలల్లో అయ్యాయి. కానీ, దీని అమలుపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఇంకా విధి విధానాలు రూపొందిస్తున్నట్లు చెప్పుకొస్తోంది. అవసరానికి ఇవ్వకుండా తరువాత ఇస్తే ఉపయోగమేమిటి అన్న

చర్చ సర్వత్రా జరుగుతోంది. మరోవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు కావస్తోంది. ఉబాలు కూడా జిల్లాలో ప్రారంభమయ్యాయి. కానీ, ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20వేల గురించి మాట్లాడడం లేదు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మూడు దఫాల్లో ఇచ్చిన రైతు భరోసా పథకం మొత్తంలో ఒక దఫా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఇచ్చేది. ఇప్పుడు సాయం గురించి మాట్లాడకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. 19ఏళ్ల నుంచి 65ఏళ్లలోపు వయసుగల మహిళలందరికీ రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్న మాటలు నేడు మచ్చుకు కూడా కనిపించడం లేదు. మరోవైపు రూ.20లక్షల ఉద్యోగాలు, ఈలోపు నిరుద్యోగ భృతి అన్న మాటలు కూడా మచ్చుకు వినిపించడం లేదు. మహిళలు అడగకపోయినా ఆర్టీసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించారు. అధికారంలోకి వచ్చి ఎన్నో నెలలు కాకపోయినప్పటికీ, దీనిపై అదుగో ఇదిగో అంటూ చెప్పాల్సిన అవసరం ఏముందని చాలా మంది నోట వినిపిస్తోంది. వీటన్నింటికి మించి ఏడాదికి మూడు గ్యాస్ సిలెంటర్ల ఉచితంగా ఇస్తామన్న హామీ కోసం గ్రామీణ ప్రాంతంలో పేదలంతా ఎదురు చూస్తున్నారు. దీంతో పాటు 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు ఏడాదికి 1500 ఇస్తామన్న హామీ కూడా ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఇలా ఏ నలుగురు కలిసినా సూపర్ సిక్స్ పథకాల గురించి చర్చ జరుగుతోంది. వీటి గురించి మాట్లాడకుండా ముఖ్యమంత్రి రాష్ట్రంలోని అప్పులు ఆర్థిక పరిస్థితుల గుర్తించి మాట్లాడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తల్లికి వందనం పథకం అమలుకు సాక్షాత్తు రాష్ట్ర విద్యాశాఖ మంత్రే సంఘాలతో చర్చిస్తాం. రోడ్‌మ్యాప్ రూపొందిస్తాం అన్న మాటలు అమలుపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితి సంగతి ముఖ్యమంత్రికి ఎన్నికలకు ముందు గుర్తులేవా? అంటూ జనం చర్చించుకుంటున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు
డిపో మేనేజర్, కండక్టర్ ఎంపిక

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆలిండియా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు మీట్ పోటీలకు ఎపిఎస్‌ఆర్‌టిసి తరపున శృంగవరపుకోట డిపో మేనేజర్ కె.రమేష్, కండక్టర్ సురేష్‌కుమార్ ఎంపికయ్యారు.ఆఫీసర్ల కేటగిరీలో వెయ్యి మీటర్ల ఫాస్ట్ వాకింగ్ 50 ఏళ్లలోపు విభాగంలో డిపో మేనేజర్, ఇతర కేటగిరీలో జావెలిన్‌త్రోలో కండక్టర్ ఎంపికయ్యారు. సెప్టెంబర్ 19, 20, 21వ తేదీల్లో విశాఖలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వీరు రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారు. వీరిని డిపో ఉద్యోగులు అభినందించి, జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

వీణల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక గొల్లపల్లి వీణల కేంద్రంలో వీణల తయారీపై హస్త కళాకారులకు లేపాక్షి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా లేపాక్షి కార్యనిర్వహణ అధికారి ఎ.కార్తీక్ మాట్లాడుతూ హస్తకళలతో మంచి గుర్తింపు వస్తుందని, వీణల తయారీపై ఆసక్తి చూపాలని కోరారు. బొబ్బిలి వీణకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. 20 మంది కళాకారులకు రెండు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇటీవలే ప్రమాదవశాత్తు కుమారుడ్ని కోల్పోయిన వాల్లె నాగేశ్వరరావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు పరామర్శించారు. శనివారం తంగుడుబిల్లి వెళ్లి జరిగిన దుర్ఘటన పట్ల దుఃఖం వ్యక్తం చేశారు. నాగేశ్వర రావు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయుకులు ధవళ లక్ష్మణ రావు తదితులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కొత్తవలస : కొత్తవలసలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్లో సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కనకాల శివ తెలిపారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలో చాలామంది రైతుల భూములు ఆన్‌లైన్‌లో నమోదు కాక ఇబ్బంది పడుతున్నారని జనసేన నాయకులు తహశీల్దార్ మామిడి సురేష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కొత్తగా విధుల్లోకి చేరడంతో జనసేన నాయకులంతా ఆయనను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ భూములకు తగిన ఆధారాలు ఉంటే ఆన్‌లైన్ చేయాలని కోరారు. చాలామంది పేదలకు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఆయనకు తెలిపారు. జనసేన నాయకులు పల్ల రాంబాబు, పల్లంట్ల జగదీష్, గుండపు సూరిబాబు, పిడుగు జోగారావు, మైలపల్లి అప్పలకొండ, గోపిశెట్టి పవన్, కొండపు రమణ, సత్తిబాబు, వెంకటేష్ తదితరులు కలిశారు.

పారసాంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పారసాంలో జిల్లా స్థాయి వాలీబాల్ డే, నైట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన సంగంరెడ్డి జగదీష్ మెమోరియల్ వాలీ బాల్ పోటీలను సాయి యువజన సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొలగాన నారాయణ రావు, ఎంపిటిసి సంగంరెడ్డి జగన్నాథం పోటీలు లాంఛనంగా ప్రారంభించారు. కాగా పోటీల్లో గెలిచిన ప్రథమ స్థానం 15వేలు, ద్వితీయ స్థానం 10వేలు, తృతీయ స్థానం 5వేలు, నాల్గో స్థానం సాధించిన జట్టుకు రూ.2500 బహుమతిగా అందించనున్నట్లు నిర్వాహుకులు తెలిపారు.

కోర్టు ఆవరణలో న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి- రాజాం

టౌన్ కోర్ట్ ఆవరణలో శనివారం సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వివేకానంద శ్రీనివాస్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా నూతన న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో మాదకద్రవ్యాలు వినియోగం అక్రమ రవాణా బాగా ఎక్కువైందని అన్నారు. మాదక ద్రవ్యాలకు యువత బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

క్రమశిక్షణతో కూడిన నాయకత్వ లక్షణాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాయకత్వ లక్షణాలు అలవర్చాలని ఎఎస్‌ఐ గోవిందరావు అన్నారు. పట్టణంలోని నారాయణ పాఠశాలలో శుక్రవారం తరగతులకు విద్యార్థి కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎఎస్‌ఐ ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలు అందించారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ఎజిఎం శివరాం, రీజనల్ ఇన్‌ఛార్జి రవికుమార్, ప్రిన్సిపల్ బిఎన్ఎస్ ప్రసాద్, పాఠశాల ఎజిఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తదాతలకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక గాయత్రి హాస్పిటల్‌లో కంచర్ల వారి నగరపాలక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పొట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయనగరం పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ టి.ఆనందబాబు పాల్గొని రక్తదాతలను అభినందించారు. ఒక పాఠశాల ఉపాధ్యాయుడు సామాజిక బాధ్యతగా రక్తదానం ఆవశ్యకత తెలుసుకొని వేసవికాలంలో సుమారు 320 యూనిట్లు పైగా రక్తదాతలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు అందించి ప్రాణదాతగా నిలిచిన పొట్టా.శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో గాయత్రి హాస్పిటల్ ఎండి డాక్టర్ జి.బి వెంకట్, రెడ్ క్రాస్ ప్రతినిధి ఎం. రాము, పిటిసి ఆర్ఐ డి .శంకర్రావు, నగరపాలక సంస్థ పాఠశాల ఉపాధ్యాయులు సవితాన సంతోష్ కుమార్, రెడ్ క్రాస్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం 46మంది రక్తదానం చేశారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ఎపిజిఇఎ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నెల్లిమర్ల యూనిట్ నూతన కార్యవర్గం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎన్నికైంది. జిల్లా ఎపిజిఇఎ జిల్లా జాయింట్ సెక్రటరీ, నెల్లిమర్ల తాలూకా ఇంఛార్జి లెంక సత్తిబాబు ఎన్నికల పరిశీలకులు గా, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారిగా ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలో అధ్యక్షులుగా పి.వీరన్న దొర, కార్యదర్శిగా టి.శివప్రసాద్, సహాధ్యక్షులుగా డాక్టర్ జి.చక్రవర్తి, కోశాధికారిగా ఎం.మురళీమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.వెంకటరావు ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా కె.విజయలక్ష్మి, బి.ఉమ, జి.పద్మ గౌరి, జె. వేణుబాబు, జె.వి. లీలను, సంయుక్త కార్యదర్శులుగా బి.ఎ.వెంకటేశ్వరరావు, కె.శ్యాంకుమార్ యాదవ్, హెచ్ సౌజన్య, జి.కృష్ణవేణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులచే ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు కంది వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పట్టణ అద్యక్షులు సిహెచ్ వెంకట సతీష్, కెఆర్ సూర్యనారాయణ, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థి

ప్రజాశక్తి-వేపాడ

పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి మిగతా విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలిచింది ఓ విద్యార్థిని. మండలంలోని జాకేరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని యశస్విని పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటింది. వీటి సంరక్షణ బాధ్యతలను ప్రధానోపాధ్యాయులు తరగతుల వారీగా అప్పగించారు

అధికారులపై సభ్యులు ధ్వజం

సర్వసభ్య సమావేశానికి సభ్యులు కాని వారే హాజరు

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు అధికారుల పనితీరుపై సభ్యులు ధ్వజమెత్తారు. ముందుగా విద్యాశాఖ చర్చలో భాగంగా ఎంఇఒ ఎం.వరప్రసాదరావు మాట్లాడుతూ ఈనెల 8న పాఠశాలల ఎన్నికలను సజావుగా జరిపాలని కోరారు. తాటిపాడు, అంబఖండి పాఠశాలల్లో వంట ఏజెన్సీ మార్పునకు గత ఎండిఎం నిర్వాహకులు రాజీనామా పత్రం అందించారని సభలో ప్రస్తావించగా దీనిపై సభ్యులు అడ్డు తగిలి వంట నిర్వాహకులకు బలవంతంగా రాజీనామాలు చేయించారని ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఇచ్చిన తీర్మానం ఆధారంగా కమిటీ ఆమోదించి తొలగించేందుకు చర్యలు తీసుకున్నామని ఎంఇఒ చెప్పారు. బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చలమయ్య గైర్హాజరు కావడంతో ఎంపిహెచ్ఒ రాధాకృష్ణ వైద్య సేవలపై మాట్లాడుతుండగా బూరాడ, కొర్లవలస సర్పంచులు శశి భూషణ్, చంద్రశేఖర్‌లు అడ్డు తగిలి 24 గంటలు పిహెచ్‌సి అయినప్పటికీ ఎవరు పనిచేయడం లేదని మండిపడ్డారు. తీర్మానం చేసి వైద్యుడుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఎపిఎం గోవిందరావు మాట్లాడుతూ సబ్ ప్లాన్ ప్రాప్తికి ఎస్‌సి, ఎస్‌టిలకు రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. మహాజన్ సభలు గ్రామ ప్రజాప్రతినిధులకు తెలియకుండా నిర్వహించడం పట్ల సభ్యులు ఎపిఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపిఒ హరినాథ్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని ప్రస్తావించగా వైస్ ఎంపిపి టంకాల అచ్చంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు అడ్డు తగిలి వారానికి ఆరు రోజులు పనులు జరగవలసి ఉండగా కేవలం ఐదు రోజులకి పని దినాలు లెక్కించడం సరికాదన్నారు. దేవుదలలో ఛానల్ పనులు కాకుండా చెరువు పనులు చేయడం ఎంతవరకు సమంజసమని సర్పంచ్ దుర్గ గవరయ్య ప్రశ్నించారు. గతంలో తీర్మానం లేకే పనులు చేయలేకపోయామని ఎపిఒ సమాధానం చెప్పారు. చెలికానివలసలో టెక్నికల్ అసిస్టెంట్ పార్థసారథి వేతనదారుల వద్ద నుండి 50 రూపాయలు వసూలు చేస్తున్నారని సర్పంచ్ అప్పలనాయుడు సభ దృష్టికి తెచ్చారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీచరణ్ మాట్లాడుతూ జలజీవన్ పథకంలో 17 గ్రామాలకు సంబంధించిన 11 గ్రామాలకు నీటి సరఫరా అందిస్తున్నామని మరో 6 గ్రామాల్లో 78 శాతం పూర్తయిందని అన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరయ్యారు.

సభ్యులు కాని వారే అధికంపై మండిపాటు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

సర్వసభ్య సమావేశానికి సభ్యులు కాని వారు ఎక్కువ శాతం సభలో చర్చించడం పట్ల అధికారులు పెదవిరించారు. సభ్యులు కాని వారు ప్రశ్నించడం పట్ల అధికారులు అసహనం వ్యక్తం చేశారు. సభ్యులు కాని వారు సమావేశానికి హాజరు పట్ల ఎంపిడిఒ శ్యామల కుమారి పట్టించుకోకపోవడంతో సభలో మరింత గందరగోళం నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సభ్యులకూ మాత్రమే సమావేశానికి అనుమతి ఇవ్వాలని సమావేశానికి రాకుండా బయట ఉంచాలని పలువురు కోరుతున్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎల్లారావు, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, సిఎస్‌డిటి శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు, పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘిస్తే ఉద్యోగం చేయనివ్వం : ఎమ్మెల్సీ

గ్రామస్థాయిలో వైసిపి నాయకులు కార్యకర్తలు సర్పంచ్, ఎంపిటిసిలకు పలు కార్యక్రమాలపై ప్రోటోకాల్ ఉల్లంఘిస్తే ఉద్యోగాలు చేయనివ్వమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఉద్యోగులపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఉందని అధికారులు పెచ్చు మీరవద్దని సుతిమెత్తగా మందలించారు. 2026 ఏప్రిల్ 3 వరకు, సర్పంచులు పదవీకాలం ఉందనీ 2026 అక్టోబర్ 25 వరకు ఎంపిటిసి, జెడ్‌పిటిసి పదవీకాలం ఉందని అంతవరకు బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

రస్తాను ఆక్రమించి చదును చేసిన స్థలం

'హెచ్చరిక'ను లేపేశారు
బోర్డును తొలగించి మరీ ఆక్రమణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడు రెవెన్యూ పరిధిలోని నాయుడుచెరువు ఉంది. సర్వే నంబరు 152లో 1.26 ఎకరాల చెరువు గర్భంలోని రస్తాను రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించారని రైతులు 2022 సంవత్సరంలో అధికారులకు ఫిర్యాదుచేశారు. అప్పటి రెవెన్యూ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఇది రస్తాగా గుర్తించారు. అది ప్రభుత్వానికి చెందిన స్థలమని, ఎవరు ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తప్పని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటుచేశారు. ప్రస్తుతం అదే ఆక్రమణదారుడు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తొలగించేశాడు. ఆ స్థలంలో మొక్కలు నాటేందుకు చదును చేశాడు. ఈ విషయాన్ని సచివాలయ, రెవెన్యూ అధికారులకు మళ్లీ విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామానికి చెందిన రైతు రాజునాయుడు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి, ప్రభుత్వ భూమిని సంరక్షించాలని కోరుతున్నారు.

రమాచౌదరిని అభినందిస్తున్న బాబూరావు

రమాకు గద్దె అభినందన

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఇటీవల ఇండోర్‌లో మిసెస్ ఇండియాగా అవార్డు అందుకున్న వెలిచేటి రమాచౌదరిని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు అభినందించారు. గత నెల 27న మండలంలోని చిన్ననడిపల్లి గ్రామానికి చెంది వెలిచేటి రమాచౌదరి మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరిగిన ఫెలీనా ఇంటర్‌నేషనల్ కాంపిటేషన్స్‌లో పాల్గొని రన్నరప్‌గా నిలిచారు. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్షుడు సర్వోత్తమకుమార్ చేతుల మీదుగా రమాచౌదరి అవార్డుని అందుకున్నారు. ఈ మేరకు శనివారం మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావుని ఆమె కలిసారు.

చరిత్రలో నిలిచిపోయే ఆలయ నిర్మాణం

ప్రజాశక్తి-చీపురుపల్లి

చరిత్రలో నిలిచిపోయే ధర్మశాస్తా అయ్యప్ప ఆలయాన్ని నిర్మాణం చేపట్టామని చీపురుపల్లి దర్మశాస్తా అయ్యప్ప ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు తెలిపారు. నూతనంగా నిర్మాణం జరుగుతున్న ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సుమారు మూడున్నర కోట్ల రూపాయలతో ఆలయ నిర్మాణం చేస్తున్నా మన్నారు. సహకారం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొంచాడ శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, ఎస్‌విజి శ్రీనివాసరావు, అప్పికొండ ఆదిబాబు పాల్గొన్నారు.

మరణించిన పోలీసు కుటుంబాలకు 'చేయూత'
ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసుశాఖలో పని చేసి, ఇటీవల కాలంలో మరణించిన కానిస్టేబులు, హోంగార్డు కుటుంబాలకు 'చేయూత' అందించేందుకు సిబ్బంది సమకూర్చిన ఒక్కరోజు అలవెన్సును జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసుశాఖలో పని చేస్తూ ప్రమాదవసాత్తు లేదా ఆకస్మికంగా లేదా అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలు అర్ధంతరంగా తమ కుటుంబ పెద్దను కోల్పోయి, ఆర్థికంగా నష్టపోయిన సమయంలో వారికి ప్రభుత్వం నుండి బెనిఫిట్స్ అందే వరకు వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు పోలీసు ఉద్యోగులు, హోంగార్డులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చేయూత అందించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా హోంగార్డుగా పని చేస్తూ, మరణించిన జి. వెంకట సత్యం కుటుంబానికి 'చేయూత'గా రూ.3,26,600 చెక్కును ఆయన సతీమణి జి.పార్వతికి ఎస్‌పి అందజేశారు. పోలీసుశాఖలో కానిస్టేబులుగా పని చేస్తూ, అనారోగ్య కారణాలతో మరణించిన పి.గౌరీ కుమార్ కుటుంబానికి 'చేయూత' రూ.1,48,900 ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో ఆయన సతీమణి టి. ఇందిరా వసంతికి ఎస్‌పి అందించారు. రాష్ట్ర ప్రభుత్వం హోంగార్డు ఉద్యోగుల పిల్లలకు మంజూరు చేసిన మెరిట్ స్కాలర్ షిప్‌లను అందజేశారు. చదువును నిర్లక్ష్యం చేయవద్దని, మంచి లక్ష్యంతో

కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

విద్యను అభ్యసించి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఆఫీసు సూపరింటెండెంట్ ఎ.ఎస్.వి.ప్రభాకరరావు, ఆర్‌ఎస్‌ఐ ఆర్.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.సువర్ణలక్ష్మి

లెండిలో 'ఫ్రెషర్స్ ఇండక్షన్'

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని జొన్నాడ లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కొత్తగా చేరిన బి.టెక్ విద్యార్థులకు హైదరాబాద్‌లోని ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఈఎఫ్ఎల్‌యూ) సీనియర్ ప్రొఫెసర్ జి.సువర్ణ లక్ష్మి 'భాష, జీవితం' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ రంగంలో విజయం సాధించడానికి కమ్యూనికేషన్‌లో విశ్వాసం అవసరమని అన్నారు. భాషా నైపుణ్యాలు విద్యార్థులకు వారి భవిష్యత్‌లో వారి ఆలోచనలు, అవసరాలకు దోహదపడతాయన్నారు. ఇంజినీరింగ్ విద్యలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేలా ఓరియంటేషన్ ప్రోగ్రామ్ విద్యార్థులను తీర్చిదిద్దుతుందని ప్రిన్సిపాల్ రామారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, ఆంగ్ల విభాగానికి చెందిన శ్రావణి, రేవతి, ఎండి రెజ్వాన్‌తో సహా హెచ్ఒడి డాక్టర్ దుర్గా శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి-వేపాడ

ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని త్రీఎఫ్ ఆయిల్‌పాం కంపెనీ జనరల్ మేనేజర్ విజయ ప్రసాద్ తెలిపారు. మండలంలో వావిలపాడు గ్రామ సచివాలయ పరిధిలో గిరిజన గ్రామమైన కడకొండ వద్ద శనివారం ఎన్‌ఎంఇఒపి పథకం ద్వారా ఆయిల్‌పాం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులకు ఆయిల్‌పాం సాగువల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పాం తోటల పెంపకానికి ఎక్కువ నీరు అవసరం లేదన్నారు. ఒకసారి వేసిన పంట సుమారు 30 ఏళ్ల వరకు రైతుకు ఆదాయాన్ని అందిస్తుందని చెప్పారు. పంటను మీ గ్రామానికి వచ్చి పండించే స్థలంలోనే కొనుగోలు చేసే వెసులుబాటు ఉందన్నారు. సమావేశంలో గ్రామ నాయకులు బీల సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలు నేరుగా రైతులుగా అందేలా పరిశ్రమ పనిచేయాలని కోరారు. ఉపాధి హామీని ఈ తోటల పెంపకానికి అనుసంధానం చేస్తే రైతుకు కొంత భారం తగ్గుతుందని తెలిపారు. ఆ ప్రతిపాదన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉందని జిఎం తెలిపారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖాధికారి పద్మ, వావిలపాడు ఉప సర్పంచ్ ముత్యాలనాయుడు, పరిశ్రమ జోనల్ మేనేజర్ జోషికిరణ్, వై.వి రమణ, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వావిలపాడు గ్రామ నాయకులు బీల సతీష్

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి-చీపురుపల్లి

మాదక ద్రవ్యాలకు అలవాటు పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని చీపురుపల్లి జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వై. ప్రేమలత యువతకు సూచించారు. స్థానిక వెంకటరమణ డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు వాటి అనర్థాలపై సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం ఒక ప్రమాదకరమైన వ్యసనమని అన్నారు. యువతరాన్ని దారి మళ్లించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం అనేది చాలా తీవ్రమైందని అన్నారు. వీటికి అలవాటు పడిన విద్యార్థులు గానీ, యువకులు గానీ తమ చదువులతో పాటు వివిధ ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులవుతున్నారిని చెప్పారు. నల్లమందు, కొకైన్, హెరాయిన్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు రవాణా చేసినా, నిల్వ ఉంచినా, సరఫరా చేసినా కఠినమైన చట్టాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు, సీనియర్ లాయర్లు ఆర్ నాగభూషణరావు, జగదీశ్వరరావు, డి రఘుపతినాయుడు, కె త్రినాథరావు, మీసాల లక్ష్మణరావు, ఝాన్సీ, కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటి ఆవరణ ప్రాంతాలలో చుక్కనీరు కూడా నిల్వ లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం బొండాడ వీధి, చిన్న వీధి, ఉసిరికల సత్రం జంక్షన్ తదితర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఎక్కడైతే నీరు చేరి నిల్వ ఉంటుందో అక్కడ లార్వా పెరిగి దోమలుగా రూపాంతరం చెందుతాయన్నారు. కొన్ని ఇళ్లకు వెళ్లి ఆయా ఇంటి ఆవరణలో రోళ్ళు, కుండీలలో నిల్వ ఉన్న నీటిని తొలగించి వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా ఫ్రిడ్జ్‌ల అడుగుభాగంలో, ఎయిర్ కూలర్లలో, కొబ్బరి చిప్పలు, టైర్లు, పెంకులు, కుండీలలో నీరు నిల్వ ఉంటుందని, అవే దోమల వృద్ధికి కేంద్రాలని తెలిపారు. నీరు నిల్వ లేకపోతే లార్వా ఉత్పత్తి తగ్గుతుందన్నారు. కావున ప్రజలు మరింత చైతన్యవంతులై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బవిరెడ్డి సతీష్, పారిశుధ్య పర్యవేక్షకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ పూడిక తీత పనులు పరిశీలన

స్థానిక గంటస్తంభం ప్రాంతంలో ఉన్న ప్రధాన కాలువలో పూడిక తీత పనులను కమిషనర్ ఎంఎం నాయుడు పరిశీలించారు. మూడు రోజులుగా జెసిబిలు సహాయంతో ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడికతీతను తొలగించి వేస్తున్నారు. మిగిలి ఉన్న కాలువలలో కూడా పూడికతీత పనులు పూర్తి చేసి వర్షపు నీరు సజావుగా ప్రవహించే విధంగా చూస్తామన్నారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి

ప్రజాశక్తి-బొబ్బిలి

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఐటిఐ కాలనీ, మల్లమ్మపేట అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు అరుణ, శుభలక్ష్మి పాల్గొన్నారు. **బొబ్బిలిరూరల్ :** నారసింహునిపేటలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ చేశారు. తల్లిపాల ప్రాముఖ్యతపై సూపర్ వైజర్ ప్రభావతి అవగాహన కల్పించారు. **తెర్లాం :** పెరుమాళి, జగన్నాథవలస, కాలంరాజుపేటలో అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చిట్టమ్మ , అంగన్వాడీలు ఎన్.లక్ష్మి, విజయభారతి, రత్నకుమారి, దమయంతి, సునీత పాల్గొన్నారు. **కొత్తవలస :** మంగళపాలెం, సీతంపేట, అప్పన్నపాలెం, ఉత్తరాపల్లి, గొల్లలపాలెం, దేవాడలో తల్లిపాల ఆవశ్యకతపై వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పిలు కామేశ్వరి, నాగజ్యోతి, ధనలక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత, హెచ్‌వి పద్మావతి, ఎఎన్‌ఎంలు లక్ష్మి, తులసి లక్ష్మి, విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, అంగన్వాడీలు రామలక్ష్మి, సత్య కౌసల్య, సుబ్బలక్ష్మి, సత్యలక్ష్మి, కుమారి, ఆశావర్కర్లు స్వప్న, విజయలక్ష్మి, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు. **బొండపల్లి** మండలంలో గరుడబిల్లిలో వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ ఆధ్వర్యంలో తల్లిపాల అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు , ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

7న జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 7న జరగబోవు జాతీయ చేనేత దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పద్మశాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు. గిడుతూరి రాము, జిల్లా యువజన అధ్యక్షుడు. సప్పా ప్రసాద్ కోరారు. శనివారం పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం ఆవరణలో. సంఘ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. చేనేత దినోత్సవాన్ని నెల్లిమర్లలో గల శాలివీధి లో నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లాలో ఉన్న చేనేత కార్మికులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు జి. పైడితల్లి, ఉపాధ్యక్షుడు కె.బలరాం, కోశాధికారి కె.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఇంట్లో దొంగతనం

● రెండు తులాల బంగారం ● 20 వేల నగదు అపహరణ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చింతలవలసలో పోలీస్ ఇంట్లో దొంగతనం జరిగి రెండు తులాల బంగారం, రూ. 20వేలు నగదు అపహరణకు గురైన సంఘటన గురువారం రాత్రి జరిగినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలవలస గ్రామంలో 5వ బెటాలియన్‌లో ఎఆర్ ఎస్‌ఐగా పని చేస్తున్న లింగాల ఎర్రయ్య రెండు ఫ్లోర్ల ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నాడు. పై పోర్షన్‌లో ఆయన నివసిస్తుండగా కింద పోర్షన్‌లో అదే బెటాలియన్‌కు చెందిన ఎఆర్ ఎస్‌ఐగా పని చేస్తున్న అనపర్తి బంగారు రాజుకు అద్దెకు ఇచ్చారు. ఈ రెండు కుటుంబాలు కలిపి గత నెల 28న తీర్థయాత్రలకు వెళ్లాయి. దీంతో ముందుగా ఎర్రయ్య ఇంట్లో దొంగలు చొరబడి గేట్లు తలుపులు, తాళాలు విరగగొట్టి ఇంటిలో రెండు తులాల బంగారం ముక్క, 20 వేల రూపాయలు నగదును, కింద పోర్షన్‌లో ఉంటున్న బంగారురాజు ఇంట్లో పావుతులం చెవి దిద్దులు దొంగలు దోచుకున్నారు. ఇంట్లో ఇంకా ఏమీ దొరకకపోవడంతో బీరువాలు అన్నింటిని చంద్ర వందనం చేశారు.

దీంతో శుక్రవారం ఉదయం పనిమనిషి మొక్కలకు నీళ్లు పోయడానికి వచ్చి గేటుకు ఇంటికి వేసిన తాళాలు విరగ్గొట్టి ఉండడంతో ఇంటి యజమాని ఎర్రయ్యకు ఫోన్ ద్వారా తెలియపరిచింది. దీంతో ఎర్రయ్య నెల్లిమర్లలో ఉన్న తన అల్లుడు రాఘవకు ఫోన్ చేసి ఈ విషయాన్ని చెప్పాడు. అల్లుడు సంఘటన జరిగిన ఇంటికి చేరుకొని మామ ద్వారా ఇంట్లో వస్తువులను నగదను పరిశీలించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.